

# ట్రూ ఫ్రెండ్

తొత్తడి గణపతిరావు

"కంగ్రాట్స్ రావుగారూ! ఇలాగే రచనలకు బహుమతులందుకుంటూ ముందుకుపోవాలనాశిస్తున్నాను" సెక్షన్ హెడ్ మాధవరావు కరచాలనం చేస్తూ అన్నాడు.


"థాంక్యూ సర్."

"రావుగారూ! మీరు కథల స్థాయి నుంచీ నవలల స్థాయికెదిగి ఈ స్వీటు పార్టీని డిన్నర్ పార్టీకి...డిన్నర్ పార్టీని ఆ పార్టీగా...స్థాయి పెంచుతారని ఆశిస్తున్నాను" భావగర్భితంగా నవ్వుతూ కరచాలనం చేశాడు రంగారావు.

రంగారావు అన్న 'ఆ పార్టీ' ఏదో అందరికీ అర్థమయి పెద్దగా నవ్వేశారు.

సెక్షన్ అంతటికీ స్వీట్లతో పాటుగా కూల్ డ్రింకులు కూడా ఇప్పించాడు రావు.

ఇంతకీ విషయమేమిటంటే ఓ పత్రిక నిర్వహించిన కథలపోటీలో రావు రాసిన




'ఆ రాత్రి కథ'కు ద్వితీయ బహుమతి వచ్చింది. రావు చిన్న రచయిత... కొన్ని రేడియో నాటికలు, కథలు, 'కవితలు ఇదివరకే వెలుగు చూశాయి. కానీ బహుమతి రావడం ఇదే మొదటిసారి. ఆ సందర్భాన్ని పురస్కరించుకునే ఈ పార్టీ.

"అందరం మాట్లాడుతున్నాం... మరి కవితగారి అమూల్యాభిప్రాయం ఏమిటో... అన్నట్టు కవితగారూ మీరు కథ చదివారా" అడిగాడు రంగారావు ఓరగా చూస్తూ.

"చదివాను" ముక్తసరిగా జవాబు చెప్పి పనిలో లీనమైపోయింది కవిత.

రావుదృష్టి కవితవైపు మళ్ళింది. ఇంతమంది తనను కంగ్రాట్యులేట్ చేస్తున్నారు. తన కథని మెచ్చుకుంటున్నారు...కాని కవిత మాత్రం ఏమీ మాట్లాడకుండా ముభావంగా ఉండటంలో అర్థమేమిటి? ఏమైనా కవితలో కొంత మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు కవిత తనకు బెస్టు ఫ్రెండ్. తను రాసిన చిన్న జోక్ పడినా నాలుగులైన్ల కవిత అచ్చయినా ఆనందంగా మెచ్చుకుని అందరి కంటే ముందుగా తనకు కంగ్రాట్స్ చెప్పేది. కాని యిప్పుడు తన కథకు బహుమతి వచ్చినా ఏమీ మాట్లాడకపోవడంలో అర్థమేమిటి? తను ఎదిగిపోతుంటే చూడలేక కుళ్ళిపోతున్నదా? ఛీ... ఇలాంటి కవితనా తను బెస్ట్ ఫ్రెండుగా ఫ్యామిలీ ఫ్రెండుగా భావించాడు...రావుకు కవిత మీదున్న మునుపటి స్నేహభావానికి తెర పడ్డట్లనిపించింది.

• • •

ఆఫీసు అయిన తర్వాత కాసేపు

ర్యారమ్స్ అది యింటికి బయలుదేరాడు రావు.

ఇంటికి వెళ్ళేసరికి రావు తల్లి సుభద్రమ్మ, శ్రీమతి జయ, ఇద్దరు చెల్లెళ్ళు, అమ్మాయి సరళ... అబ్బాయి రాహుల్ అందరు తీరుబడిగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ మధ్య కవితను చూసి రావు ముఖం చిట్లించుకున్నాడు, కవిత మొన్నటి ప్రవర్తన రావుకు కష్టం కలిగించింది. అప్పటినుంచి కవితతో ముభావంగానే ప్రవర్తిస్తున్నాడు అయినా యింటికి వచ్చినపుడు పలకరించకపోతే మర్యాదగా ఉండదని పలకరించాడు.

"రావుగారూ! మీరు త్వరగా ముఖం కడుక్కుని రండి...ఇవాళ్ళ చిన్న ప్రోగ్రాం వేశాము" అంది కవిత.

"ఏంటో...?

"ముందు మీరూ ముఖం కడుక్కుని కాఫీ తాగిరండి జయగారూ! మీరు వెళ్ళి ఆ ఏర్పాట్లు చూడండి....మీకీ మధ్య పతిభక్తి తగ్గిపోయినట్లుందంటోయ్... వెళ్ళండి...వెళ్ళండి.ముఖం కడుక్కుని వచ్చి కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతున్నాడు రావు.

"ఇక మొదలెడదాం ప్రోగ్రాం.రావుగారూ మొన్న బహుమతి పొందిన కథ యింతవరకు మీ ఇంట్లో ఎవరూ చదవనే లేదట. ఆ విషయం మీకు తెలుసా!"

"ఏమో!" ముభావంగానే అన్నాడు రావు.

"అదేమిటండీ...బహుమతిపొందిన కథ...మీకు పేరుతెచ్చిన కథ అంత గొప్ప కథ అందరికీ చదివి వినిపించాలన్నదే ఇవాళ నా ప్రోగ్రాం."

"కవితగారూ...ఏమిటి... కథ... కథ...నలుగురిలో చదవడమేమిటి?"

"ఏం? కథ చదివితే ఏమవుతుంది? మంచికథ నలుగురూ వింటారు"-పత్రిక తెరిచింది కవిత—"పిండారబోసినట్లుంది వెన్నెలరాత్రి-మదనతాపంతో ఆమె..."

"స్టాప్...ఆగండి...కథ గట్టిగా చదవడమేమిటి? మీ కిష్టమైతే చదువుకోండి...లేకపోతే లేదు...కాని హరికథలా...

"వాడి మాటలకేం...నువ్వు చదవమ్మా" సుభద్రమ్మగారు కాపింపట్టు వేసుకూర్చున్నారు కథ వినడానికి.


"నువ్వు చదువు ఆంటీ" రావుగారి పిల్లలు తొందరచేస్తున్నారు.

"కానీయండి" రావుగారి చెల్లెలు దగ్గరగా చేరుతూ అంది.

"కానీ...కవితా" రావు భార్య వంత పాడింది."

కవిత మొదలుపెట్టింది. "మదనతాపంతో ఆమె..."

"కవితా...ఆగండి...మీరా కథ చదవడానికి వీల్లేదు. చూడబోతే నామీద కక్ష సాధించడానికే ఈ కార్యక్రమం పెట్టినట్లున్నారు" లోపల అనుకోవాలను




ఉన్న రావు రైటోకే అనేసి చరచరా వదిలి డాబామీదికి వెళ్ళిపోయాడు.

పుస్తకం మూసి కవిత కూడా డాబా మీదికి వెళ్ళింది- ఎవర్నీ పైకి రావద్దని హెచ్చరిస్తూ.

అసహనంగా డాబామీద పచార్లుచేస్తున్నాడు రావు. కవిత రావడం చూసి ముఖం చిట్లించుకున్నాడు.

"ఏం ఎందుకలా అసహనంగా ఉన్నారు. కథ అందరి ముందూ చదవడం మీ కెందు కిష్టంలేదు?"

"కవితా...ఆ టాపిక్ ప్రస్తుతానికి వదిలేస్తే సంతోషిస్తాను"

"కానీ రావుగారూ! ఆ టాపిక్ తేల్చుకోవడానికి యివాళ ప్రోగ్రాం వేశాను. నా సంగతి మీకు తెలుసు. చెప్పాలనుకున్నది ఎవరేమనుకున్నా నిర్మొహమాటంగా చెప్పడం నా అలవాటు. నిజం

చెప్పండి నలుగురిముందు మీ కథ ఎందుకు చదవొద్దన్నారు."

"........."

"అవును. మీరు సమాధానం చెప్పలేరు. నేను చెబుతాను. ఆ కథ నలుగురి ముందూ చదివితే మీరు భరించలేరు. అదీ మీకు కావల్సినవాళ్ళముందయితే అసలు భరించలేరు. చాటుమాటుగా ఒకరికి తెలియకుండా ఒకరు చదువుకోవాల్సిన సాహిత్యం అది. అంతేనా- యువతరపు బలహీనతల్ని రెచ్చగొట్టి మైకంలో పడేసే పచ్చి శృంగార సాహిత్యం అది అవునా?"

"కవితా!"

"మిష్టర్ రావ్!... అనవసరంగా ఆవేశపడకండి. నేను చెప్పినదాంట్లో నిజం లేకపోతే చెప్పండి. నలుగురు కూర్చుని చదువుకోవడానికి సిగ్గుపడే రచన ఓ సాహిత్యమేనా? ఇవాళ మీ వాళ్ళ ఎదురుగా చదివితే భరించలేక పోయారే... మరి వాళ్ళు రహస్యంగా చదువుకుంటే పర్వాలేదా? మీ పచ్చి శృంగార సాహిత్యాన్ని క్లాసు పుస్తకాల మధ్య దాచుకుని చదువుకుంటూ యువతరం ఏ పరిస్థితికి దిగజారిపోతుందో ఒక్కసారి ఆలోచించండిసార్. వాళ్ళలో ఒక్కసారి మీ చెల్లెళ్ళనో... మీ అమ్మాయినో... మీ అబ్బాయినో మీరు చూడగల్గితే ఈ సంఘానికి మీరు చేస్తున్న ద్రోహం ఏమిటో అర్థమవుతుంది." ఆవేశంతో కవిత ముఖం ఎర్రబడింది.

ఆమె వాగ్ధోరణికి రావు అవాక్కైపోయాడు. కవిత చెప్పినదాంట్లో నిప్పులాంటి నిజం అతని కళ్ళకి కట్టినట్లయింది. పాఠకులకు తనెంత ద్రోహం చేస్తున్నాడో అర్థమయింది.

"సారీ కవితా...నిజంగా...యు... యు...యు ఆర్ మై ట్రూ ఫ్రెండ్... కవితా నిన్ను అపార్థం చేసుకున్నందుకు క్షమించు. ప్రామిస్ చేస్తున్నాను. ఇక ముందు అచ్చయ్యే నా ప్రతి రచనా... నలుగురిలో హాయిగా చదువుకునేదిగా వుంటుంది" అన్నాడు రావు.

చిరునవ్వు నవ్వుతూ రావు కళ్ళలోకి సాదరంగా చూసింది కవిత.

